ఇష్టారాజ్యం..!



కైలాసగిరి రోప్‌వేకు ఎదురుగా వీఎంఆర్‌డీఏ పార్కులో నిర్వహిస్తున్న ఓపెన్ రెస్టారెంట్

- వీఎంఆర్‌డీఏ పార్కులో యథేచ్ఛగా అనధికారిక వ్యాపార కార్యకలాపాలు
- ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు అనుమతి పొంది.. పార్కు మొత్తం ఆక్రమణ
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ఎంవీపీకాలనీ: పర్యాటకులకు, నగరవాసులకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కు ఆక్రమణకు గురైంది. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు అనుమతి పొందానంటూ ఓ వ్యాపారి ఏకంగా పార్కునే ఆక్రమించడం చర్చనీయాంశంగా మారింది. ఎంవీపీ కాలనీ సెక్టార్-9లోని కైలాసగిరి రోప్‌వేకు ఎదురుగా సముద్ర తీరాన్ని ఆనుకొని వీఎంఆర్‌డీఏ పార్కు ఉంది. అరెకరాకు పైగా విస్తీర్ణం గల ఈ పార్కులో గతంలో సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచేలా అనేక ఏర్పాట్లు చేశారు. చుట్టూ ఫెన్సింగ్‌తో పాటు కూర్చునేందుకు సహజ సిద్ధంగా రాళ్లు, బెంచీలు తీర్చిదిద్దారు. దీంతో దశాబ్దాలుగా ఈ పార్కు సందర్శకులకు, నగర వాసులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఇటీవల ఓ ప్రైవేట్ వ్యాపారి వీఎంఆర్‌డీఏ నుంచి ఫాస్ట్‌ఫుడ్ షాప్ నిర్వహణకు అనుమతి పొందానని చెప్పి పార్కులో వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించాడు. అంతటితో ఆగకుండా ఏకంగా పార్కు మొత్తాన్ని తన అధీనంలోకి తెచ్చుకుని ఓపెన్ రెస్టారెంట్ ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నాడు. దీంతో ఈ పార్కు మనుగడే ప్రశ్నార్థకంగా మారింది.

ఓ ఉద్యోగి సహకారంతో..

నగరంలోని పలు కూడళ్లలో నిర్వహిస్తున్న చిన్న చిన్న షాపులకే వీఎంఆర్‌డీఏ రూ.40 వేల నుంచి 50 వేల వరకు నెలకు అద్దెగా వసూళ్లు చేస్తుండగా.. అరెకరా విస్తీర్ణంలోని ఈ పార్కులో పెద్ద కంటైనర్ సముదాయం ఏర్పాటు చేసి పార్కు మొత్తాన్ని అధీనంలోకి తీసుకొని వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్న వ్యక్తి నెలకు రూ.31 వేలు చెల్లిస్తుండటమేంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇతడికి వీఎంఆర్‌డీఏలోని ఓ కీలక ఉద్యోగి.. ఉన్నతాధికారులకు తెలియకుండా సహకారం అందిస్తున్నట్లు సమాచారం. సంబంధిత అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


పార్కు మొత్తం ఏర్పాటు చేసిన టేబుళ్లు, కుర్చీలు

మొత్తం ఆక్రమించేసి.. ఓపెన్ రెస్టారెంట్‌గా మార్చేసి...

ఈ పార్కులో '99 రెస్టో కేఫ్' పేరిట ఏడాదిగా ఆ ప్రైవేట్ వ్యక్తి అనధికారిక వెజ్ అండ్ నాన్‌వెజ్ రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడు. దీని నిర్వహణ కోసం వీఎంఆర్‌డీఏ నుంచి అనుమతి తెచ్చుకున్నట్లు అతడు వెల్లడిస్తున్నప్పటికీ దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్కులో ఫుడ్ సెంటర్ నిర్వహణ కోసం ప్రతి నెలా రూ.31 వేలు వీఎంఆర్‌డీఏకు అద్దె చెల్లిస్తున్నట్లు అతడు ప్రచారం చేసుకుంటున్నాడు. ఈ పార్కులో ఒక పక్క కేవలం ఫుడ్ షాపు మాత్రమే నిర్వహించుకునేందుకు అనుమతి పొందినట్లు సమాచారం. దీంతో దాన్ని సాకుగా చూపి సదరు వ్యాపారి పెద్ద కంటైనర్ సముదాయం ఏర్పాటు చేయడంతోపాటు పార్కు మొత్తాన్ని ఆక్రమించుకుని దాన్ని పెద్ద రెస్టారెంట్‌గా మార్చేశాడు. దీంతోపాటు పార్క్ ఓపెన్ ప్లేస్ అంతటా బెంచీలు, కుర్చీలు వేసి కస్టమర్లను ఆహ్వానిస్తూ ఇష్టారాజ్యంగా వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నాడు. ఈ పరిణామంతో పార్కులో సందర్శకులకు చోటు కసుమరుగైంది. పార్కు ఆక్రమణను, పర్యాటకుల అవస్థలను వీఎంఆర్‌డీఏ అధికారులు పట్టించుకోవడం లేదు.

మత్తు పదార్థాల జోలికి పోవొద్దు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ హాల్‌లో గురువారం డ్రగ్స్ వాడకాన్ని నిరసిస్తూ యువతకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల ఆరోగ్యం, జీవితం, భవిష్యత్తు నాశనమవుతాయన్నారు. యువత మంచి ఆరోగ్య జీవనాన్ని అలవర్చుకుని ఉన్నత వ్యక్తిత్వంతో ఎదగాలని ఆకాంక్షించారు. విలువైన మానవ వనరులుగా యువతరం నిలుస్తూ దేశ అభ్యున్నతిలో భాగం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డ్రగ్ ప్రివెన్షన్ కమిటీ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, ఆచార్యులు

కృష్ణా కళాశాలలో మెగా జాబ్‌మేళా రేపు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21న జవహర్ నాలెడ్జ్ సెంటర్, సూర్య ఇన్ఫోటెక్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. కళాశాలలో గురువారం జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. టాటా గ్రూప్, విప్రో, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్, అరబిందో ఫార్మా, హోండా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, పేటీఎం, ఎస్ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, అపోలో, తదితర కంపెనీలు పాల్గొంటున్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జాబ్‌మేళాకు హాజరయ్యే యువతీ యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలు తీసుకుని శనివారం ఉదయం 9.30 గంటలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన

బీచ్‌రోడ్డు: కూటమి ప్రభుత్వం ప్రధాని మోదీ సేవలో తరిస్తూ.. అదానీకి లాభాలు చేకూర్చేలా ప్రజలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తోందని సీపీఎం సీనియర్ నాయకుడు వై.రాజు ఆరోపించారు. సీపీఎం జగదాంబ జోన్ నేత నరసింహరావు ఆధ్వర్యంలో గురువారం రామ్‌నగర్ బజార్‌లో విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పాత కరెంట్ బిల్లును దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గతంలో పెంచిన విద్యుత్ చార్జీలు అదానీ లాభాలకు సరిపోలేదని, ఇప్పుడు చార్జీలు పెంచి బిల్లులో కలిపి వేయడం ప్రజా వ్యతిరేకమన్నారు. కొత్తగా స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై మరింత అదనపు భారాలు వేయడం అన్యాయమన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు దుర్గారావు, చిట్టిబాబు కార్మిక సంఘం నాయకులు కె.మౌళి, కె.సంతోష్‌కుమార్, సీఐటీయూ జగదాంబ జోన్ నాయకుడు చంద్రమౌళి, అధిక సంఖ్యలో రామ్‌నగర్ వాసులు, మహిళలు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మహిళల ఆర్థిక ప్రగతికి 'నారీశక్తి'తో భరోసా

ఏయూక్యాంపస్: ఏపీ చాంబర్స్ మహిళా విభాగం ఆధ్వర్యంలో గురువారం మహిళా పారిశ్రామిక వేత్తలకు యూనియన్ నారీశక్తి పథకంపై అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ నరసింహకుమార్ మాట్లాడుతూ నారీశక్తి పథకం ప్రత్యేకతలను వివరించారు. మహిళ పారిశ్రామిక వేత్తలను సాధికారత దిశగా తీర్చిదిద్దడానికి ఈ స్కీమ్ ఏ విధంగా దోహదపడుతోందో తెలియజేశారు. వ్యాపార రంగంలో అడుగిడే మహిళలకు ఈ పథకం ఒక ప్రధాన వనరుగా నిలుస్తుందన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలకు మద్దతుగా వర్కింగ్ క్యాపిటల్, టర్మ్ లోన్‌లతో సహా వివిధ రుణాలను అందిస్తామని తెలిపారు. బ్రాంచ్ మేనేజర్ ముకుంద ప్రియ మాట్లాడుతూ ఈ పథకంలో భాగంగా రుణ మొత్తం కనిష్ఠంగా రూ.2 లక్షల నుంచి మొదలవుతుందని, దీనికి ఎటువంటి సీలింగ్ లేదన్నారు. స్వయం సహాయక బృందాలకు రుణ పరిమితి రూ.20 లక్షలుగా ఉంటుందని చెప్పారు. నారీశక్తి శాఖలు ఆర్థిక సాయాన్ని అందించడంతోపాటు నైపుణ్యాభివృద్ధి, నెట్‌వర్కింగ్, సలహా సేవలు అందిస్తాయన్నారు. మహిళా విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ వై.గీతా శ్రీకాంత్, వైస్ చైర్‌పర్సన్ ఎ.లీలారాణి, పలువురు మహిళా పారిశ్రామికవేత్తలు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఇప్పటికే ఈ పథకాన్ని వినియోగించుకుంటున్న పారిశ్రామికవేత్తలు తమ అనుభవాలను పంచుకున్నారు.


మహిళా పారిశ్రామికవేత్తలతో యూబీఐ రీజినల్ హెడ్ నరసింహకుమార్

'పెనుగొండ'కు సాహిత్య అకాడమీ అవార్డుపై హర్షం

ఎంవీపీకాలనీ: ప్రముఖ రచయిత, చరిత్రకారుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించడంపై అరసం రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య చందు సుబ్బారావు, ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గుంటూరులో సంప్రదాయ సనాతన ధర్మ ప్రచారకులపై లక్ష్మీనారాయణ అలుపెరగని పోరాటం చేశారని చందు సుబ్బారావు పేర్కొన్నారు. న్యాయవాదిగా కొనసాగుతూనే అరసంలో కేంద్ర రచయితల సంఘం సభ్యుడిగా ముఖ్య భూమిక పోషించారన్నారు. ఆయన రచించిన వ్యాస సంపుటి కరదీపికకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం అభినందనీయమన్నారు. దేవిశ్రీతో కలిసి ఆయనకు అభినందనలు తెలిపారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

మద్దిలపాలెం: మహిళా చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు అన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, ఐసీసీ, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉన్నత విద్యా శాఖ, యూజీసీ ఆదేశాల మేరకు గురువారం కళాశాలలో నేషనల్ జెండర్ క్యాంపెయిన్ నయా చేతన 3.0 కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాలు, లింగ ఆధారిత హింస, మహిళలు-గృహ హింస అనే అంశాలపై విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలను ప్రిన్సిపాల్ విజయబాబు ప్రశంసించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు డాక్టర్ బి.లక్ష్మి, డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, ఐసీసీ కో ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.ఎస్.అనురాధ, ఎన్ఆర్సీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.ఎల్.రూపవాణి, అధ్యాపకులు ఎం.రమ్య, పి.ధనలక్ష్మి, డాక్టర్ ఎస్.పద్మావతి, డాక్టర్ పుష్పలత, డాక్టర్ పద్మజ, రాజారావు, విద్యార్థులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

కళాభారతిలో నేటి నుంచి నృత్యోత్సవాలు

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 22 వరకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నృత్యోత్సవాలు నిర్వహించనున్నట్లు కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు తెలిపారు. గురువారం కార్యక్రమ వివరాలను ఆయన వెల్లడించారు. ప్రతి ఏటా ఆనవాయితీగా మూడు రోజుల పాటు నృత్యోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 20న ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్ కుమార్ హాజరు కానున్నారన్నారు. వెంకట చిన్నారావు శిష్య బృందం భరతనాట్యం ప్రదర్శిస్తారని, ముఖ్య అతిథిగా రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ఆచార్య కె.సి.రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. 21న ఎ.బి.బాలకొండలరావు శిష్య బృందం శ్రీకృష్ణ పారిజాతం కూచిపూడి నృత్య రూపకాన్ని ప్రదర్శిస్తారన్నారు. పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం కొరియోగ్రఫీ చేశారని తెలిపారు. 22న వెంపటి చినసత్యం కూచిపూడి కళాక్షేత్రం విద్యార్థులు మోహిని భస్మాసుర నృత్యరూపకం ప్రదర్శించనున్నారన్నారు. కార్యక్రమానికి కనకమహాలక్ష్మి బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని చెప్పారు. ప్రతి రోజు సాయంత్రం 6.15 గంటలకు నృత్య కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. అందరూ ఆహ్వానితులేనని, ఎటువంటి ప్రవేశం రుసుం లేదని తెలిపారు.

పూర్వ విద్యార్థులు వర్సిటీకి విలువైన సంపద

విశాఖ విద్య: పూర్వ విద్యార్థులు యూనివర్సిటీకి విలువైన సంపదగా నిలుస్తారని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు డాక్టర్ జి.సాంబశివరావును ఆయన సత్కరించారు. కామర్స్ మేనేజ్‌మెంట్ పూర్వ విద్యార్థిగా రాష్ట్రంలో ప్రముఖ పారిశ్రామికవేత్తగాఎదిగిన సాంబశివరావు సాధించిన ప్రగతి నేటి తరం విద్యార్థులకు స్ఫూర్తిదాయకమన్నారు. కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగ విద్యార్థులకు మార్గనిర్దేశం చేయాలని కోరారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, కామర్స్ మేనేజ్‌మెంట్ ఆచార్య జాలాది రవి తదితరులు పాల్గొన్నారు.


సాంబశివరావును సత్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

సక్రమంగా విధులు నిర్వర్తించండి

సచివాలయ కార్యదర్శులతో జీవీఎంసీ కమిషనర్

ఏయూక్యాంపస్: సచివాలయ కార్యదర్శులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. జోన్-3 పరిధిలోని ఆర్‌కే బీచ్ రామకృష్ణ మిషన్ లైబ్రరీ వద్దనున్న మూడు సచివాలయాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యదర్శుల విధులు, హాజరు, డైరీలను పరిశీలించారు. సచివాలయ పరిధిలో ఎన్ని నూతన నిర్మాణాలు, అనధికార కట్టడాలు గుర్తించారని డబ్ల్యూపీఆర్ఎస్ కార్యదర్శులను ఆరా తీశారు. 21086165 సచివాలయంలో ఆస్తి, తాగునీటి పన్నులు ఇప్పటివరకు ఎంత వసూలు చేశారని సిబ్బందిని ప్రశ్నించారు. 21086166 సచివాలయానికి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం వచ్చిన వారితో మాట్లాడి వారు అది పొందడానికి ఎన్ని రోజులు పట్టిందని అడిగారు. సచివాలయాలకు రోజుకు ఎన్ని అర్జీలు వస్తున్నాయి, ప్రజల పొందే సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సచివాలయ కార్యదర్శులకు తమ ఖాళీ సమయాల్లో జీవీఎంసీ నిర్వహిస్తున్న ప్రజా అవగాహన కార్యక్రమాల్లో భాగం కావాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజలకు అందించే సేవలు, బోర్డులను సచివాలయం బయట ప్రదర్శించాలని సూచించారు. మహిళా పోలీస్ కార్యదర్శుల విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ మానసిక వైద్యశాల సమీపంలోని అన్న క్యాంటీన్‌ను జీవీఎంసీ కమిషనర్ సందర్శించి భోజన నాణ్యత, పరిశుభ్రత, తాగునీటి సరఫరా మెదలైనవి పరిశీలించారు. శుచి, రుచికరమైన భోజనాన్ని ప్రజలకు అందించాలని అన్న క్యాంటీన్ ఆహార సరఫరా నిర్వాహకులకు సూచించారు. జోన్-3 కమిషనర్ కె.శివప్రసాద్, రెవెన్యూ ఆఫీసర్ డేవిడ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ 33/11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీపీడీ కార్యాలయం, జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీ, కామాక్షినగర్, పైనాపిల్ కాలనీ, ఎస్ఎస్ఎన్ నగర్, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, గోల్ఫ్ క్లబ్, ముడసర్లోవ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కంటి వ్యాధులపై అవగాహన

ఆరిలోవ: హనుమంతవాక వద్ద ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో గురువారం వైద్యులు మహిళలకు నేత్ర వ్యాధులపై అవగాహన కల్పించారు. కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ శివాని మాట్లాడుతూ పురుషుల కంటే మహిళల్లో 50 శాతం నుంచి 60 శాతం వరకు కంటి వ్యాధులకు గురవుతున్నారన్నారు. జీవ సంబంధమైన, హార్మోన్ల కారణంగా మహిళలు కంటి వ్యాధులకు గురవుతున్నట్లు తెలిపారు. వీటిపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యాధులకు గురైనవారు వెంటనే కంటి వైద్యులను సంప్రదించి చికిత్స చేసుకోవాలని సూచించారు. మహిళలకు వచ్చే డ్రై ఐ సింట్రోమ్, గ్లకోమా, శుక్లాలు, డయాబెటిక్ రెటినోపతి, ఆటో ఇమ్యూన్ డిజాస్టర్స్, రెటినా మెయిన్ అక్లూజన్, ఇడియోపతిక్ ఇంట్రాక్రానికల్ హైపర్‌టెన్సన్(ఐఐహెచ్) తదితర కంటి వ్యాధుల గురించి ఆమె వివరించారు. వాటి వల్ల కలిగే సమస్యలను తెలియజేశారు. అలాంటి సమస్యలు తెలుసుకోవడానికి వైద్య పరీక్షలు జరిపించుకోవాలని మహిళలకు సూచించారు.

ఆదర్శ మూర్తి అహల్యాబాయి

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాలలో లోకమాత అహల్యాబాయి హోల్కర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గురువారం అహల్యాబాయి 300వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అట్టడుగు వర్గాల అభ్యున్నతి, సాధికారత కోసం రాజమాత చేసిన కృషిపై సదస్సు ఏర్పాటు చేశారు. అహల్యబాయిపై పుస్తకాన్ని రచించిన చిన్మయి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ దేశంలో దేవాలయాల పునరుద్ధరణ, ధర్మశాలల నిర్మాణం, అభివృద్ధికి అహల్యబాయి చేసిన కృషిని వివరించారు. సమాజంలో వివిధ వర్గాలను సమన్వయం చేస్తూ వారి అభివృద్ధికి పాటుపడిన విధానం ఆదర్శనీయమని కొనియాడారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం సమావేశానికి అధ్యక్షత వహించారు. విద్య, సాంస్కృతిక పురోగతికి, సుపరిపాలన సాంఘిక సంక్షేమం అందించడంలో అహల్యాబాయి కృషిని ప్రశంసించారు. మానవత్వంతో ఆమె చేసిన సహాయం, ప్రజల అభ్యున్నతికి పాటుపడిన విధానాన్ని వివరించారు. ఆచార్య ఎస్.బి.చంద్రకళ, డాక్టర్ కె.పల్లవి, డాక్టర్ టి.ఎస్.రాజకుమారి, డాక్టర్ సిహెచ్.దివ్య శ్రీదేవి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ఆచార్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సీతామాణిక్యం

ఆత్మ పరిశుద్ధంగా ఉంటేనే ఆరోగ్యం

విశాఖ విద్య: ఆత్మ పరిశుద్ధంగా ఉంటనే ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఆధ్యాత్మిక బోధకురాలు, స్వామి పార్థసారధి శిష్యురాలు సుశీలాజీ అన్నారు. వేదాంత ఇన్‌స్టిట్యూట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏయూలోని వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో భగవద్గీతలోని 10వ అధ్యాయం విభూతి యోగంపై ఇంగ్లిష్‌లో జరుగుతున్న ఐదు రోజుల జ్ఞాన యజ్ఞం(ప్రవచనాలు) కార్యక్రమంలో భాగంగా రెండో రోజు గురువారం పలు అంశాలపై ఆమె ప్రసంగించారు. విద్యుత్ శక్తి ఏ విధంగా వివిధ ఉపకరణాల్లో వెలుగుగా రుపాంతరం చెందుతుందో.. ఆత్మ కూడా వివిధ రకాలుగా రుపాంతరం చెందుతుందన్నారు. ఈ అధ్యాయంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు వివిధ రుపాల్లో తన దివ్య మహిమల గురించి తెలియజేయడంపై ప్రవచించారు. ముందుగా భజన కీర్తనలు ఆలపించారు. స్వామీ పార్థసారధి వివిధ అంశాలపై రచించిన పుస్తకాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో వేదాంత ఇన్‌స్టిట్యూట్ విశాఖపట్నం ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు, అధిక సంఖ్యలో నగర వాసులు పాల్గొన్నారు.


ప్రవచిస్తున్న సుశీలాజీ

అరకు కాఫీని ప్రమోట్ చేయాలి

మహారాణిపేట: భారత మాజీ క్రికెటర్, ఐపీఎల్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు డైరెక్టర్ వేణుగోపాలరావు గురువారం జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జీసీసీ బలోపేతానికి సలహాలు ఇవ్వాలని, అరకు కాఫీని ప్రమోట్ చేయాలని, క్రికెట్ స్టేడియంలో అరకు కాఫీని పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని వేణుగోపాలరావును కోరారు.


వేణుగోపాలరావుకు గిరిజన ఉత్పత్తులను అందిస్తున్న శ్రావణ్‌కుమార్

27 నుంచి నృత్య సమ్మేళనం

మద్దిలపాలెం: కూచిపూడి నాట్య పతాక ఆవిష్కరణ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని విశాఖలో ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించనున్న ఇంటర్నేషనల్ ట్రెడిషనల్ డ్యాన్స్ కాంగ్రెస్(ఐటీడీసీ) లోగోను గురువారం రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆవిష్కరించారు. ఐటీడీసీ వ్యవస్థాపకుడు, ది డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకుడు బత్తిన రంగ విక్రమ్‌కుమార్ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో మూడు రోజుల పాటు నృత్య సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ముగింపు రోజున కళాకారులకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు. నృత్య సమ్మేళనం ముగింపు సందర్భంగా వీఎంఆర్‌డీఏ పార్కుకు ఆనుకొని ఉన్న ఎంజీఎం పార్కులో 1500 మందికి పైగా నాట్య కళాకారులచే మహా బృంద నృత్య ప్రదర్శన నిర్వహించనున్నామన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్, ఐటీడీసీ ముఖ్య సలహాదారు వి.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

విశాఖ విద్య: యువతరం పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.శశిభూషణరావు ఆకాంక్షించారు. ఏయూ కాన్వొకేషన్ హాల్‌లో గురువారం నిర్వహించిన ఎంబీఏ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ఏయూతో ఉన్న కాలాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. నూతన ఆలోచనలు, ఆవిష్కరణలకు వేదికగా విశ్వవిద్యాలయ వ్యవస్థ నిలుస్తుందన్నారు. నిపుణులైన ఆచార్యుల మార్గదర్శకాన్ని స్వీకరించాలని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మాట్లాడుతూ ప్రతిష్ఠాత్మమైన ఏయూలో ఉన్నత విద్యను అభ్యసించడం, ఇక్కడ నేర్చుకున్న పాఠాలను నిత్యజీవితంలో కార్యరూపంలో చూపుతూ కార్యసాధకులుగా మారాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి తదితరులు ప్రసంగించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ తప్పనిసరి

ఆరిలోవ: ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ద్వారకా ట్రాఫిక్ సీఐ ప్రసాద్ స్పష్టం చేశారు. జాతీయ రహదారిపై హనుమంతవాక కూడలి వద్ద గురువారం ద్విచక్ర వాహన చోదకులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. మైక్ పట్టుకొని సీఐ ప్రచారం చేపట్టారు. ఈ కూడలిలో నాలుగు వైపుల ఆగి ఉన్న ద్విచక్ర వాహన చోదకుల వద్దకు మైక్ పట్టుకొని వెళ్లి హెల్మెట్ పెట్టుకోవడం వల్ల ఉపయోగం, ధరించకపోతే జరిగే అనర్థాల గురించి తెలియజేశారు. 2025 జనవరి 1 నుంచి ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తి, వెనుక కూర్చొన్న వ్యక్తి కూడా హెల్మెట్ తప్పనిరిగా ధరించాలని సూచించారు. లేదంటే జరిమానా విధించడం, లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

న్యాయ కళాశాల హాస్టల్‌కు 30 మంచాల బహూకరణ


దాతలను సత్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాల విద్యార్థుల హాస్టల్‌కు రాజమహేంద్రవరానికి చెందిన జక్కంపూడి సరోజలక్ష్మి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు జక్కంపూడి రాహుల్ దత్త, శ్రావ్యలు 30 మంచాలు, బ్లాంకెట్స్ బహూకరించారు. సుమారు రూ.1.5 లక్షలతో వీటిని విద్యార్థులకు ఉపయుక్తంగా తయారు చేసి గురువారం న్యాయ కళాశాల హాస్టల్‌లో అందజేశారు. అనంతరం వీరు ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావుతో సమావేశమయ్యారు. న్యాయ కళాశాల విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే మంచాలను హాస్టల్‌కు బహూకరించడంపై వీసీ సంతోషం వ్యక్తం చేశారు. దాతలను వర్సిటీ తరపున సత్కరించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, న్యాయ కళాశాల హాస్టల్ చీఫ్ వార్డెన్ ఆచార్య ఎస్.హరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

'వాల్యూ వర్చువల్ ల్యాబ్స్'పై వర్క్‌షాప్


మాట్లాడుతున్న ప్రాజెక్ట్ మేనేజర్ సనీష్

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమృత విశ్వ విద్యాపీఠం సహకారంతో గురువారం 'వాల్యూ వర్చువల్ ల్యాబ్స్' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. అమృత విశ్వ విద్యాపీఠం ప్రాజెక్ట్ మేనేజర్ పి.ఎఫ్.సనీష్, రీసెర్చ్ అసోసియేట్ ఎస్.నిజిన్ రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్చువల్ ల్యాబ్స్ ప్రాముఖ్యత, ఉపయోగాలు, ఫిజికల్ సిమ్యులేషన్, బయోలాజికల్ మోడలింగ్ అంశాల గురించి హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ ద్వారా వివరించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ స్విమ్మింగ్ పురుషులు, మహిళల జట్టు ఎంపిక


క్రీడాకారులతో విజయమోహన్ తదితరులు

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ స్విమ్మింగ్ పోటీల పురుషులు, మహిళల జట్టు ఎంపిక గురువారం జరిగింది. ఏయూ జిమ్నాజియంలో వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్.విజయమోహన్ క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ చెన్నైలో ఈ నెల 21 నుంచి 24 వరకు మహిళలు, పురుషుల ఇంటర్ యూనివర్సిటీ స్విమ్మింగ్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో రాణించి ఆంధ్రా యూనివర్సిటీకి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఏయూ వ్యాయామ విద్యా విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి, స్విమ్మింగ్ జట్టు కోచ్ రామకృష్ణ, క్రీడాకారులు పాల్గొన్నారు.